క్లుప్తంగా

కొలనుభారతి దేవి సేవలో లోకాయుక్త జస్టిస్



కొలనుభారతి అమ్మవారిని దర్శించుకున్న లోకాయుక్త జస్టిస్ దంపతులు

కొత్తపల్లి: కార్తీక మాసం పురస్కరించుకుని మండలంలోని కొలనుభారతిదేవి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయాన్ని చేరుకున్న వారికి పురోహితులు ఆలయ సంప్రదాయానుసారం స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని విశేషపూజా కార్యక్రమాలు నిర్వహించుకొన్నారు. అదేవిధంగా అక్కడే ఉన్న సప్తశివాలయాలలోని దేవతామూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఆలయ ఈఓ మోహన్ జస్టిస్ దంపతులను పూలమాల దుశ్శాలువలతో సత్కరించారు. ఈయన వెంట తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ ఉన్నారు.

ఏఐకేఎస్ సమావేశాల నిర్వహణకు రూ.4500 విరాళం

కర్నూలు(సెంట్రల్) : ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల నిర్వహణకు పట్టణ పౌర సంక్షేమ సంఘం విరాళాన్ని ప్రకటించింది. ఈ క్రమంలో ఆదివారం విరాళం రూ.4500ను ఆ సంఘం నాయకులు ఈ.పుల్లారెడ్డి, యాకోబు, నాగరాజు, రమణగౌడు తదితరులు ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, ప్రభాకరరెడ్డికి అందజేశారు.

బీజేపీ పాలనలో దళితులపై దాడులు

కర్నూలు(సెంట్రల్) : బీజేపీ పాలనలో దళితులపై దాష్టికాలు అధికమయ్యాయని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని 19వ వార్డు పరిధిలో ఉన్న నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీలో దళిత హక్కుల పోరాటసమితి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో దళితులపై దాడులు అధికమైనట్లు స్వయంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌సీఆర్‌బీసీ వెల్లడించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కుమార్‌రాజా, రామచంద్ర పాల్గొన్నారు.

18న చలో కలెక్టరేట్

కర్నూలు(సెంట్రల్) : ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, జిల్లా గౌరవాధ్యక్షుడు జయ నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ..ఆశా వర్కర్లతో 18 సంవత్సరాలుగా 26 రకాల వైద్య ఆరోగ్య రంగానికి సంబంధించిన పనులు చేయిస్తున్నారన్నారు. పనిభారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు శివలక్ష్మీ, నాగార్జున, అమ్మ శేషమ్మ, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరాటే సాధన అవసరం



కలర్‌బెల్టులు ప్రదానం చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శాంత

కర్నూలు (టౌన్): మహిళలకు మార్షల్ ఆర్ట్స్ వంటి కరాటే సాధన క్రీడలు అవసరమని సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శాంత అన్నారు. ఆదివారం స్థానిక సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాలలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆడపిల్లలు ఆరోగ్యం పెంపొందించుకునేందుకు ప్రతి రోజు క్రమం తప్పకుండా శిక్షణలో పాల్గొనాలన్నారు. అనంతరం బెల్టు పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు కలర్ బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాస్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్‌ఆర్ టీయుసీ అధ్యక్షుడు రమణ

కర్నూలు (టౌన్) : అప్కాస్ పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లు, లోడర్లు, మలేరియా వర్కర్లు, టాయ్‌లెట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు రమణ అన్నారు. ఆదివారం స్థానిక పాత బస్టాండ్‌లోని స్కంద కాంప్లెక్‌లో ఉన్న ఆ యూనియన్ కార్యాలయంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021 సంవత్సరం నుంచి పర్మనెంట్ కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ ఎన్‌కాష్‌మెంట్ ఇవ్వాలన్నారు. 11 వ పీఆర్‌సీ ప్రకారం పెండింగ్‌లో ఉన్న వేతనం, కరువు భత్యం చెల్లించాలన్నారు.

వనభోజనం..ఆనందమయం

- నగర శివారు ప్రాంతాల్లో కార్తీక వనభోజనాల సందడి
- పెద్ద సంఖ్యలో హాజరైన ఆయా కులాల నాయకులు, అధికారులు, ప్రజలు
- మహిళలు, చిన్నారుల ఆటపాటలతో హోరెత్తిన ప్రాంగణాలు



వాల్మీకి/ బోయల వనభోజనాల్లో పాల్గొన్న మేయర్ బీవై రామయ్య, తదితరులు,



ఉప్పర సంఘం కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సత్యన్న

కర్నూలు(అర్బన్): పవిత్ర కార్తీక మాసం నేటితో ముగుస్తున్న నేపథ్యంలో ఆదివారం నగరంలోని పలు దేవాలయాలు, శివారు ప్రాంతాల్లో వనభోజనాల సందడి కనిపించింది. సెలవుదినం కావడంతో కుటుంబాల సమేతంగా హాజరై ఆనందంగా గడిపారు. వివిధ కులాలకు చెందిన ప్రజలు ఉదయం నుంచే తాము ఏర్పాటు చేసుకున్న ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో చేరుకుని తమ ఇష్ట దైవాలకు, ప్రత్యేకంగా ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారు. విందు భోజనాల అనంతరం చిన్నారులు, మహిళల ఆటల పోటీలతో వనభోజన మహోత్సవాలు ఉల్లాసంగా ఉత్సాహంగా సాగాయి.

వాల్మీకి/ బోయల ఆధ్వర్యంలో ...

పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నగర శివారులోని వెంకాయపల్లె ఎల్లమ్మ దేవాలయం సమీపంలోని శ్రీనివాస గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు వాల్మీకి/ బోయ కులస్తుల వనభోజన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సంస్థ నేతలు కుబేరస్వామి, తలారి క్రిష్ణనాయుడు, బేతం కృష్ణుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నగర మేయర్ బీవై రామయ్య, హోంగార్డ్స్ ఎస్పీ మహేష్ కుమార్, డీఎస్పీ వెంకటరామయ్య, ప్రముఖ వైద్యులు డా.భవానీ ప్రసాద్, డా. రామచంద్రనాయుడు, డా.జయరామ్, డా.మాధవక్రిష్ణ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ దంపతులు, సీనియర్ పాత్రికేయుడు టి. మద్దిలేటి, గుడిసె క్రిష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు. నగరంలో వాల్మీకి మహర్షి ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తే తమ తండ్రి ఓబయ్య స్మారకార్థం విగ్రహం ఏర్పాటుకు అయ్యే ఖర్చు మొత్తాన్ని భరిస్తానని డీఎస్పీ వెంకటరామయ్య ప్రకటించారు.

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ...

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సంకల్‌బాగ్ హరిహర క్షేత్రం శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక వనభోజన కార్యాక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కల్లె చంద్రశేఖరశర్మ, కార్యదర్శి హెచ్‌కే రాజశేఖర్‌రావు, సలహాదారు హెచ్‌కే మనోహర్‌రావు, గాడిచెర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూరా, డా.వేణుగోపాల్, కేవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి, భవానీ రామలింగేశ్వరస్వాములకు విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలకు, పిల్లలకు ఆటల పోటీలను నిర్వహించారు.

బలిజ సంఘం ఆధ్వర్యంలో ...

బలిజ సంఘం ఆధ్వర్యంలో జి. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వెనుకవైపున ఉన్న విజ్ఞాన పీఠంలో కార్తీక వనభోజన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర కాపునాడు జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాసులునాయుడు, అధ్యక్షుడు ఆర్జా రామక్రిష్ణ, నగర బలిజ సంఘం నాయకులు పత్తి ఓబులయ్య హాజరయ్యారు. ముందుగా వారు శివపార్వతులకు పూజ నిర్వహించారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభను సాధించిన వైద్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వ్యాపార రంగాల్లోని వ్యక్తులను సన్మానించారు.



కార్తీక వనభోజనాల్లో బ్రాహ్మణ సంఘం నేతలు

భగీరథ ఉప్పర సంఘం ఆధ్వర్యంలో ...

జిల్లా భగీరథ ఉప్పర సంఘం ఆధ్వర్యంలో స్థానిక వీవీఎస్ ఫంక్షన్ హాల్‌లో కార్తీక వనభోజనం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సత్యన్న అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వావిలాల క్రిష్ణమూర్తి, ప్రొఫెసర్ పార్వతీదేవి, ఎక్సైజ్ సీఐ రాముడు, ఏపీ వీరన్న, డి. రాముడు, ఎం. గిడ్డయ్య,కృష్ణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సగరులు అన్ని రంగాల్లో ఎదగాలని, భగీరథ వారసులమని నిరూపించాలన్నారు. అనంతరం పిల్లలకు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు.

పరిశోధనలతో సృజనాత్మకత పెంపొందుతుంది



విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న గురుకుల సమన్వయాధికారి శ్రీదేవి

కల్లూరు: సబ్జెక్టులపై పరిశోధన చేయడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని కర్నూలు జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయ అధికారిణి శ్రీదేవి అన్నారు. ఆదివారం కల్లూరు మండలం చిన్నటేకూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సైన్స్, గణితం, ఇంగ్లిషు, తెలుగు సబ్జెక్టుల్లో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదువు కుంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చున్నారు. విద్యార్థులు సైన్స్ విభాగంలో రాడార్, ట్రాఫిక్ నిబంధన పట్ల అవగాహన, ఫింగర్ ప్రింట్ వల్ల దొంగతనాలు చేసిన వారిని గుర్తించడం, పసి పిల్లలను మార్చినప్పుడు గుర్తించడం, బ్లైండ్ స్టిక్, విషవాయువుల ఉనికిని గుర్తించడం, అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే గణిత ప్రదర్శనలు, తెలుగు, ఇంగ్లిషు వ్యాకరణ అంశాలను సులువుగా నేర్చుకునే అంశాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నా అనుభవాలు-జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: బహుజన ఉద్యమ నేత, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు ఆత్మకథ 'నా అనుభవాలు – జ్ఞాపకాలు' పుస్తకాన్ని ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో మాజీ ఎంపీ బుట్టా రేణుక, రాజ్య సభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ బీసీల హక్కులు, సమస్యల పరిష్కారానికి నక్కలమిట్ట శ్రీనివాసులు పోరాడుతుండటం అభినందనీయమన్నారు. అనంతరం సామాజిక రంగంలో బుట్టా రేణుక, వైద్య రంగంలో డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, నాటక రంగంలో పత్తి ఓబులయ్య, సేవా రంగంలో ముత్తు లక్ష్మి, సాహిత్య రంగంలో ఎస్.డి.వి. అజీజ్‌ల సేవలకు గుర్తింపుగా నక్కలమిట్ట ఫౌండేషన్ వారి జీవిత సాఫల్య పురస్కారం–2023ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షులు నంది విజయలక్ష్మి, మైనార్టీ నాయకులు అన్వర్ హుసేన్, విశ్రాంత డీఎస్పీలు జయచంద్ర, మహబూబ్ బాషా, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు రాంబాబు, లక్ష్మీకాంతం, ధనుంజయాచారి, హాస్టల్ వార్డెన్స్ కృష్ణయ్య, శ్రీనివాసులు, బాబు, నక్కలమిట్ట ఫౌండేషన్ ప్రతినిధి నక్కల మిట్ట నందన్ పాల్గొన్నారు.

మెలకువలతో ప్రాణాలు కాపాడవచ్చు



బీఎల్ఎస్‌పై శిక్షణలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): అత్యవసర పరిస్థితుల్లో చిన్న చిన్న మెలకువల ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని మెడికవర్ హాస్పిటల్ ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్ అధిపతి డాక్టర్ టీవీ సునీల్ యాదవ్ చెప్పారు. మెడికవర్ హాస్పిటల్‌లో రెండు రోజులుగా అమెరికన్ హార్ట్ అసోసియేషన్ సహకారంతో వివిధ ఆసుపత్రుల సిబ్బందికి నిర్వహిస్తున్న బేసిక్ లైఫ్ సపోర్ట్, అడ్వాన్స్‌డ్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ టీవీ సునీల్ యాదవ్ మాట్లాడుతూ గోల్డెన్ అవర్‌లో అత్యవసరపు మెళకువలు పాటించేందుకు ఇలాంటి శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని ఆసుపత్రికి తరలించేలోపు కొన్ని చిన్న మెళకువల ద్వారా అత్యవసర స్థాయి ప్రథమ చికిత్స అందించి కాపాడవచ్చని తెలిపారు. దీన్నే వైద్యపరిభాషలో బీఎల్ఎస్ అని అంటారన్నారు. ప్రాణాపాయ స్థితిలో నుంచి వీలైనంత త్వరగా రక్షించి సీపీఆర్ చేయగలగాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి, సెంటర్ హెడ్ పి. నీలారెడ్డి, ఆపరేషనల్ హెడ్ ఇమ్రాన్, డీఎస్. అరుణ, డాక్టర్ మురళీకష్ణ, డాక్టర్ రాఘవ పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

కర్నూలు(హాస్పిటల్): విశ్వమానవాళికి ఆయుర్వేద శాస్త్రాన్ని అందించిన భగవాన్ శ్రీ ధన్వంతరి జయంతిని ఆదివారం స్థానిక వన్‌టౌన్‌లోని గీతా మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఆరోగ్యభారతి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయుర్వేద వైద్యులతో పాటు నగర ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆరోగ్యభారతి జిల్లా ఉపాధ్యక్షుడు, సీనియర్ వైద్యాధికారి డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆయుర్వేదం గొప్పతనం గురించి వివరించారు. మన ప్రాచీన చరిత్రలో వైద్యులుగా ఉన్న సుశ్రుతుడు, చరకుడు మొదలైన వారి గురించి పేర్కొన్నారు. వారి తర్వాత అత్రి, బృహస్పతి, కవి, చంద్ర, వరుణ, మను, ఇక్ష్వాకు మొదలైన వారు ఆయుర్వేద పరంపరను కొనసాగించారన్నారు. అంతుచిక్కని వ్యాధులతో శరీరం పీడించబడుతున్నప్పుడు దీర్ఘకాలిక రోగాలు పట్టి విడువనప్పుడు ధన్వంతరిని పూజిస్తే ఉపశమనం కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్యభారతి ఏపీ సభ్యులు డాక్టర్ ఎండీఏఎస్. రామశర్మ, ఉపాధ్యక్షురాలు కష్ణవేణి, జిల్లా కార్యదర్శి బి. సత్యనారాయణరెడ్డి, జిల్లా సహ కార్యదర్శి స్వప్న, పార్థసారథి పాల్గొన్నారు.



ధన్వంతరి చిత్రపటానికి పూజలు నిర్వహించిన ఆరోగ్యభారతి సభ్యులు

104 ఉద్యోగుల సమస్యలపై పోరాటాలు ఉద్ధృతం



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

కర్నూలు(సెంట్రల్) : 104 ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను ఉద్ధృతం చేస్తామని 104 యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో యూనియన్ కోశాధికారి చంద్రహాస్ అధ్యక్షతన 104 ఉద్యోగుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..104 ఉద్యోగ వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలన్నారు. 104లో పనిచేస్తున్న డీఈఓలకు వెయిటేజీ మార్కులు ఇచ్చి ప్రభుత్వం ఉద్యోగులకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి పెద్దయ్య మాట్లాడుతూ..ఇప్పటి వరకు యూనియన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అనేక ప్రయత్నాలు చేసిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.

పౌర హక్కులను పరిరక్షించాలి

కర్నూలు(సెంట్రల్) : నేడుభారత్‌తో సహా ప్రపంచ దేశాల్లో పౌర హక్కులు హరించబడుతున్నాయని, ఇందుకు ప్రభుత్వాలు వ్యవహరించే తీరే కారణమని సీనియర్ న్యాయవాది కె.ఓంకార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం అంబేడ్కర్ సర్కిల్‌లో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పౌర చైతన్య వేదిక సిటీ ఇన్‌చార్జ్ తేజోవతి అధ్యక్షతన న్యాయవాదులు, మహిళలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాలస్తీనాపై అత్యంత కిరాతకంగా ఇజ్రాయెల్ వ్యవహరించినా ప్రపంచ దేశాలు మిన్నకుండి పోవడం అన్యాయమన్నారు. మనదేశంలో మోదీ అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్యవాదులు, కవులు, కవయిత్రులపై కేసులు నమోదు చేసి వారి హక్కులకు భంగం కలిగిస్తున్నా ఏమి చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ చట్టాలలో ప్రభుత్వం తీసుకొస్తున్న సవరణలు అప్రజాస్వామికమైనవన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కులను పరిరక్షించడానికి ప్రజలు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎంఆర్ కృష్ణ, ఓపీడీఆర్ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, నాయకులు షాబుద్దీన్, బాబుసాహెబ్, మధన్‌రెడ్డి, ఖాదర్‌బాషా, నాగన్న, ప్రియాంక, రోజా పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాలు, న్యాయవాదులు తదితరులు

సేవ చేసే గుణాన్ని అలవర్చుకోవాలి

ఆదోనిఅర్బన్: ప్రతిఒక్కరూ ధర్మాన్ని పాటిస్తూ పేదలకు సాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని జంగమ పీఠాధిపతులు పాల్కూరు మఠం చెన్నవీర శివాచార్య మహాస్వామి, జంగమహొసల్లి ఆజాదశంభులింగ శివాచార్యులు, ఆదోని చౌకీమఠం మరిరాచోటి మహాస్వాములు, కల్లుమఠం మహాసిద్ధస్వామి సూచించారు. ఆదివారం స్థానిక భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆదోని డివిజన్ జంగమ సంక్షేమ సంఘాల సంయుక్తంగా ఆధ్వర్యంలో జంగమ జనజాగృతి మహాసభలు జరిగాయి. కార్యక్రమానికి పీఠాధిపతులతో పాటు రాష్ట్ర జంగమ కార్పొరేషన్ చైర్మన్ ప్రసన్న, కార్పొరేషన్ డైరెక్టర్ రేవతి, శ్రీశైలం ట్రస్టు బోర్డు మెంబర్లు విరుపాక్షయ్యస్వామి, సుజాత, కర్నూలు జంగమ సంఘం అధ్యక్షుడు మఠం విశ్వేరయ్యస్వామి, ఆయా సంఘాల రాష్ట్ర నాయకులు లాల్ బహదూర్‌శాస్త్రి, బసవరాజు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి మహాసభలను ప్రారంభించారు. ముందుగా పీఠాధిపతులు ఆధ్యాత్మిక విషయాలను వివరించారు. అనంతరం యువకుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చివరగా కార్తీక వనభోజనం ఏర్పాటు చేశారు. ఆదోని డివిజన్ నాయకులు బసవరాజు, మల్లికార్జునస్వామి, ఎర్రిస్వామి, వీరశైవ సేవాసమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

13 నుంచి కబడ్డీ పోటీలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో శ్రీ సీతారాముల కళ్యాణం పురస్కరించుకొని ఈ నెల 13 నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు మహేష్, వెంకటేష్, జగదీష్ పేర్కొన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. ఈ నెల 13 నుంచి 14వ తేదీ వరకు పోటీలు ఉంటాయన్నారు. విజేతకు రూ.16,116, రెండవ బహుమతి రూ.12,116 మూడవ బహుమతి రూ. 6,116 అందజేయనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే జట్టు సభ్యులు 12వ తేది సాయంత్రం లోపు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ జట్టు పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 97044 12008, 63016 06283 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నోరుతెరుచుకున్న మ్యాన్ హోల్



కర్నూలు(న్యూటౌన్): కర్నూలు ఓల్డ్‌సిటీలోని ఛత్రీ బాగ్ మసీదు వద్ద నెల రోజులుగా మ్యాన్‌హోల్ నోరు తెరుచుకుని ప్రమాదకరంగా ఉంది. అటువైపుగా ప్రతి రోజూ నడుచుకుంటూ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లే స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదవశాత్తు మ్యాన్‌హోల్‌లో పడి చాలా మంది పిల్లలు గాయాలపాలయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు నగర పాలక సంస్థ అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌కు మూతవేయాలని కోరుతున్నారు.

నృత్య 'సంబరం'



నృత్యం చేస్తున్న కళాశాల విద్యార్థులు

కర్నూలు కల్చరల్: శ్రీ వెంకటేశ్వర సంగీత నృత్య కళాశాల 7వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగిన ఈ వేడుకలో కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు విశేషంగా అలరించాయి. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు కళా రంగం ఆహ్లాదంతో పాటు మానసిక వికాసం కలిగిస్తుందన్నారు. మహిళలే సంగీత నృత్య కళాశాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాశాల నిర్వాహకులు మల్లేశ్వరి మాట్లాడుతూ కర్నూలు ఎన్నార్ పేటలో ఆరు సంవత్సరాల క్రితం తమ సంస్థను ప్రారంభించామన్నారు. వంద మందికి పైగా బాలబాలికలు శాస్త్రీయ సంగీతం, నృత్యం నేర్చుకుంటున్నారన్నారు.

ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం అండ



ఆటో డ్రైవర్ల యూనిఫాంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ , మేయర్ బీవై రామయ్య

- వాహన మిత్ర కింద ప్రతి ఏటా రూ.10వేలు అందజేత
- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మేయర్ రామయ్య

కర్నూలు(రాజ్‌విహార్): స్వయం ఉపాధి కింద ఆటోలు నడుపుకునే డ్రైవర్లు, కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటోందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ స్కూల్ ఆవరణలో ఆటో డ్రైవర్లు, కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పేదలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో అభిమానం అన్నారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు తమ వాహనాల ట్యాక్సులు సకాలంలో చెల్లించేందుకు ఏటా రూ.10 చొప్పున నగదును వారి ఖాతాల్లో వేస్తున్నారని అన్నారు. దీంతో పాటు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వీటిని అర్హులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. పేద పిల్లల చదువుకు సీఎం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా తమను కలిసి పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్‌టీఓ రమేష్, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వరరెడ్డి, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూసీ సంఘాల నాయకులు ప్రభాకర్, ఈశ్వర్, రాధాకృష్ణ, వలి, కృష్ణారెడ్డి, రాము, రవికుమార్, తిరుపాల్, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే నేరుగా కలవండి

ప్రజలు ఏవైనా సమస్యలుంటే తనను నేరుగా కలిసి పరిష్కారం పొందవచ్చని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక పాతబస్తీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లోని సమస్యలతో పాటు వైద్యం, ఆరోగ్యం, విద్యకు సంబంధించిన అర్జీలు స్వీకరించారు. తర్వాత వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

కోల్స్ చర్చి వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు (టౌన్): కోల్స్ బాప్టిస్టు చర్చి వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆదివారం నగరంలోని ఆ చర్చిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చర్చి అధ్యక్షుడు లింకన్ మాట్లాడుతూ ప్రతి ఏడాది వార్షిక క్యాలెండర్‌లో చర్చి కార్యక్రమాలు, బైబిల్ వాక్యాలు పొందుపర్చినట్లు చెప్పారు. నూతన సంవత్సరం సంఘం సభ్యులకు ఆశీర్వాదకరంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో చర్చి పాస్టర్లు రెవరెండ్. జీవన్, పాస్కల్ ప్రకాష్, చర్చి సభ్యులు జాన్ విల్సన్, రాబర్ట్ క్లెవ్, సునీల్ బెంజమెన్, ప్రభాకర్, క్రిస్మస్ నూతన సంవత్సర కమిటీ నిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.



కోల్స్ చర్చి వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఎస్టీయూ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు కల్చరల్ : రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. ఆ యూనియన్ భవన్‌లో సంఘం 77వ వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎస్.గోకారి, ప్రధాన కార్యదర్శిగా టి.కె. జనార్దన్, ఆర్థిక కార్యదర్శిగా రామ్మోహన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా తిరుమల్‌రెడ్డి, సంయుక్త అధ్యక్షులుగా నాగేంద్రప్ప, రామానుజులు, నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా రామ్మోహన్, గోవింద నాయక్, రమేష్‌నాయుడు, హనుమంతరెడ్డి, శ్రీధర్, నాగభూషణం, కార్యదర్శులుగా చంద్రశేఖర్, కలందర్, శేఖర్, మాదన్న, నాగరాజు, గోపాల్, మహిళా కన్వీనర్‌గా లక్ష్మీదేవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ రెండు సంవత్సరాలు కొనసాగనుంది. ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, జిల్లా ఎన్నికల పరిశీలకులు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఎన్నికల అధికారి రామ్మోహన్ పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

కులగణనలో భట్టురాజులు నమోదు చేయించుకోండి

- నవరత్నాలతో ఎంతో ప్రయోజనం
- రాష్ట్ర ప్రభుత్వ 56 కుల కార్పొరేషన్ల కో–ఆర్డినేటర్ ఏ ప్రవీణ్

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో చేపడుతున్న కులగణనలో భట్టురాజు సామాజిక వర్గానికి చెందిన వారందరు తమ కులాన్ని నమోదు చేయించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ 56 కుల కార్పొరేషన్ల కో–ఆర్డినేటర్ ఎ. ప్రవీణ్ కోరారు. కులగణనలో కులాన్ని నమోదు చేసుకుంటే జనాభాలో మన సంఖ్య బలం ఎంతో తెలుస్తుందన్నారు. జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం నుంచి అందే అనేక రకాల ప్రయోజనాలు పొందేందుకు వీలవుతుందన్నారు. ఆదివారం జిల్లా భట్టురాజు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కోడుమూరు రోడ్డులోని నెరవాడ దత్తాత్రేయ స్వామి దేవస్థానంలో నిర్వహించిన కార్తీక మాస వనభోజన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బడబాగ్ని సుధీర్‌బాబు, పి మల్లికార్జునరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల్లో ఎంతో మంది భట్టురాజు కులానికి చెందిన వారు ఆర్థిక ప్రయోజనం పొందారన్నారు. ఇంకా ఆయా పథకాల కింద లబ్ధిపొందేందుకు అర్హత ఉన్న వారు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. శ్రీశైలంలో భట్టురాజు అన్నదాన సత్రం ఏర్పాటు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామన్నారు. ముఖ్యంగా భట్టురాజు కులస్తులు ఐక్యంగా తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అనంతలక్ష్మి, కూరపాటి రామరాజు, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న భట్టురాజు నేతలు